హృదయం దొరికింది

— పి.వి. నేహారత్నం

కథ

మారుతీకారు నెమ్మదిగా ఆగింది-
ఇద్దరు స్త్రీలు పరిగెత్తుకొచ్చారు-
డ్రైవర్ వినయంగా కారు డోర్ తెరిచాడు-
ఒక పండుముత్తయిదువ కారులోంచి దిగింది-
పచ్చని ముఖంమీద కాసంత కుంకుమ మండుతున్న సూర్యుడిలా వెలుగుతోంది-
ఆవిడ కళ్లు లోతుకుపోయి నిద్రలేమిని సూచిస్తున్నాయి-
ఆవిడ కారులోంచి వైరాబుట్ట దింపబోతూంటే డ్రైవర్ అందుకోబోయాడు-
వద్దని వారించి ఆ బుట్టని పదిలంగా గుండెలకు హత్తుకుందావిడ-
అందులో స్టీలు కాలేజీ- పళ్లు నిండుగా వున్నాయి-
'అమ్మాయిగారు ఆటలో ఉన్నారమ్మా-రండి' అంటూ ఆ ఇద్దరు స్త్రీలూ ఆమెను సవినయంగా లోపలికి తీసుకెళ్లారు-
అక్కడంతా కోలాహలంగా వుంది-
అన్ని రకాల వయసులున్న స్త్రీలు నల్లంచు తెల్లచీరల్లో గుండ్రంగా తిరుగుతున్నారు-
ఒక యువతి హుషారుచేస్తోంది.
''రింగ రింగ రోజెస్- పాకెట్ ఫుల్ ఆఫ్ పొసెస్ అప్ప బుస్స - ఆల్ ఫెల్‌డౌన్-
అంతా కిందికి పడిపోండి- క్విక్-పడిపోండి-''
మిగిలిన వాళ్లంతా ఆ యువతి చెప్పినట్టు చేస్తున్నారు-
ఇంతలో ఒక యువతి ఏడుపు మొదలుపెట్టింది.
'పడిపోయాను- పోయింది- అయ్యో పోయింది.'
'ఏయ్ ఎందుకేస్తున్నావ్?'
'ప్రేమలో పడ్డాను- నా హృదయం పోయింది-'
మిగిలిన వాళ్లంతా కేరింతలు కొట్టారు-
ఏడుస్తున్న యువతిని పెద్దావిడతో వచ్చిన స్త్రీలు లేవనెత్తి గ్రౌండ్‌లో ఒక చెట్టుకిందకి తీసుకెళ్లారు-
'నిర్మలా ఎవరొచ్చారో నీకోసం చూడు-'
ఆవిడను చూపించారు. ఆ యువతి చుబుకం పైకెత్తి-
'నేను చూడను. నా హృదయం పోయింది.'
'నాకు దొరికిందమ్మా' - ఆవిడ గొంతు రుద్ధమైపోయింది. అలా అంటుంటే-
'అయితే నా గుండె నాకిచ్చెయ్యి'- ఆ యువతి మారాం చేస్తోంది-
'నిర్మలా! అమ్మ నీకోసం ఏం తెచ్చింది చెప్పుకో-' కేరేజ్ విప్పుతూ అన్నారావిడ-
'నాకు తెలుసులే- గోపీ కిష్టమని బొబ్బట్లు తెచ్చావ్- అమ్మో ఏపిల్స్- ఇవంటే నాకెంతిష్టమో-' ఏడుపు మానేసి ఏపిల్ కొరుక్కు తింది నిర్మల-
'ఇవాళ దీపావళి పండగా- బొబ్బట్లు చేసావ్-'
'అవునమ్మా'
'మరి టపాసులేవీ?'
'నాన్నగారు తెస్తారు'
'నాన్నగారేమిటి? మా మావగారు అవునా? మీ అల్లుడు కేంప్ కెళ్లారమ్మా నీకు చెప్పడం మర్చేపోయాను-'
'అలాగా?'
'వెళ్తూ నా హృదయం కూడా పట్టుకుపోయాడు తెలుసా? అయ్యో నాకిపుడు గుండెకాయలేదే-' పలమారింది నిర్మలకు.
'ఏడవకు నిర్మలా'-
'నిర్మలా గోపాల్ అను. పెళ్లయినవాళ్లని అలాగే అనాలి తెలుసా? ఇదిగో నా గుండెల మీద బొమ్మ వేసి రాసాను. చూడు-'
పమిట తీసి చూపిస్తోంది నిర్మల-
గుండెమీద నిజంగానే రంగు పెన్సిల్‌తో హృదయాకారపు బొమ్మలో నిర్మలా గోపాల్ అని రాసివుంది.
ఆవిడ కళ్లవెంట నీళ్లు కారిపోతున్నాయి-
'నీ ప్రేమ నర్థం చేసుకోలేని దౌర్భాగ్యుడిని ప్రేమించి ఎంత పిచ్చిలో పడ్డావే చిట్టీ-'
ఆవిడ మనసు ఆక్రోశిస్తోంది.
'అమ్మా డాక్టర్‌గారు వస్తున్నారు'-
'ఏమన్నా ఇంప్రూవ్‌మెంట్ వుందా పాణిగారూ!'
'టైము పడుతుందమ్మా'
'ఇంకా ఎన్నాళ్లు నా పిచ్చితల్లినిలా చూడాలి డాక్టర్‌గారూ!'
'తప్పకుండా బాగవుతుంది. వర్రీ కాకండి. గతంలోకంటే చాలామార్పు కనిపిస్తోంది. గమనించారా?'
'అవును' సాలోచనగా చూసారావిడ-
నిర్మల బొబ్బట్లతో ఆడుకుంటోంది-
'ఇవాళ నిర్మల పుట్టినరోజు డాక్టర్' గాఢమైన నిట్టూర్పు వెలువడింది ఆమెనుండి.

★★★

అదొక మహానగరం-
ఆ నగరం నడిబొడ్డున అతిపెద్ద హాస్పిటల్-
అందులో చికిత్స చేయించుకోగల స్తోమతు కోటేశ్వరులకే వుంటుంది-
ఆ హాస్పిటల్‌లోని ఓ ఎ.సి రూంలో-
అత్యంత పేరుప్రతిష్టలున్న ప్రముఖ సర్జన్ ప్రొఫెసర్ శాంతారాం ఎదుట-
అత్యంత దీనవదనంతో నిర్వీణ్ణుడై తలవంచుకుని కూర్చున్న వ్యక్తి-
ఆ నగరంలోకెల్ల కోటీశ్వరుడైన దీనదయాళ్-
'డైలేటెడ్ కార్డియో మయోపతీ-'
దీనదయాళ్ ఏకైక గారాల పుత్రుడు వేణుగోపాల్‌కి ప్రొఫెసర్ శాంతారాం చెప్పిన జబ్బుపేరు...
గుండె కండరాలను తొంభై శాతం వరకు క్రుంగదీసిన జబ్బు-
అప్పటికి మూడు నెలలుగా వేణుగోపాల్ గుండెకి సంబంధించిన వ్యాధితో ఆస్పత్రిలో వైద్యుల పర్యవేక్షణలో వున్నాడు-
ప్రొఫెసర్ మాటలకి క్రుంగిపోయాడు దీనదయాళ్-
'డాక్టర్! వేణు...'
ఎన్నిసార్లు తలెత్తినా ఆ ఒక్కమాట తప్ప మరోటి రావడం లేదు అతని నోటివెంట-
మనిషి ఆశాజీవి- ప్రాణం పోతున్న ఆఖరిక్షణంలో కూడా ఏ శక్తి అయినా తనకు పునర్జన్మ ప్రసాదించగలదేమో నన్నంత ఆశాజీవి-
ఏ కొడుకు కోసమైతే కోట్లకి పడగెత్తాడో-
ఏ కొడుకు మీద తన సమస్తమైన ఆశలూ పోగుచేసుకున్నాడో ఏ కొడుకు తనని పున్నామ నరకంనుంచి రక్షించగలడని ఆశించాడో ఆ కొడుకు జీవితం- రోజులు-కాదు గంటల్లో వుంది అంటున్నాడు ప్రొఫెసర్ శాంతారాం-
దీనదయాళ్‌కి దుఃఖం కూడా రావడం మానేసింది-
అదో అతీతమైన స్థితి-
ఆశ నిరాశల్లో కొట్టుకుపోతున్న తరుణం-
వేణుగోపాల్ జబ్బు అపుడే మూత్రపిండాల మీద ఇతర భాగాల మీద ప్రభావం మొదలెట్టింది.
'ఒకే ఒక్క ఆశ మిస్టర్ దీనదయాళ్-'
దిగ్గున కుర్చీలోంచి లేచాడు దీనదయాళ్-
'చెప్పండి డాక్టర్! నా బాబు ప్రాణాలు నిలబెట్టేందుకు ఎంత ఖర్చయినా వెనుకాడను-'
'ఇది ఖర్చుతో కూడినది అనేకంటే అదృష్టం మీద ఆధారపడింది అనాలి-కొన్నాళ్ల క్రితం మెదడు మరణించిన వ్యక్తి గుండెతో మార్పిడి చేసారు ప్రొఫెసర్ వేణుగోపాల్ అనే సర్జన్- మీరు వినే వుంటారు'
'అవును పేపర్లన్నీ చాలా బాగా కవరేజ్ ఇచ్చాయి.'
'మనీ అలాంటి వ్యక్తి ఒక్కరోజులోగా దొరికితే...' వార్డుబోయ్ లోపలికొచ్చాడు-
'సర్ అమ్మాయిగారు మీకోసం ఎదురుచూస్తున్నారు-'
'ఒక అరగంట- నువ్వెళ్లి చెప్పు-'
కళ్లు మూసుకునే చెప్పుకు పోతున్నాడు ప్రొఫెసర్-
ఆనాటి సర్జన్ల బృందంలో తనూ ఒకడు-
ముప్ఫయిమంది సర్జన్లు ఏకధాటిగా దాదాపు అయిదు గంటలపాటు చేసిన కృషి ఫలించింది-
గుండె మార్పిడి జయప్రదమైంది-
బి.పి- రక్త ప్రసరణ క్రమంగా మెరుగుపడ్డాయి-
మళ్లీ పునర్జన్మనెత్తిడ హాయిగా వెళ్లాడు పేషంట్-
కాని ఆనాడు అతనికి కలిసొచ్చిన అదృష్టం-
దాదాపు సమాన వయస్సులో సమానమైన బ్లడ్‌గ్రూప్ కలిగిన వైద్య పరిభాషలో మెదడు మరణించిన వ్యక్తి దొరకడం- అదీ సరైన టైములో-
'ఇర్రివర్సిబుల్ సెరెబ్రల్ హెమరేజ్'తో చేరిందామె- అటువంటి వ్యక్తుల శరీరాల నుంచి అవయవాలు తీసి అవసరమైన వారికి అమర్చేందుకు ఆ ఏడాదే పార్లమెంటు ఆమోదించడం-
ఇవన్నీకాక పేషంట్ బంధువులు వైద్యుల విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించి అనుమతించడం- అదృష్టాలు-
కలిసొచ్చిన అదృష్టాలు-
కాని మళ్లీ కాకతాళీయంగానైనా అలాంటి అవకాశం దొరికితే- వేణు బ్రతుకుతాడు-
ఇమ్యునో సప్రెసెంట్ డ్రగ్స్- పరాయి శరీర భాగాలను పేషంట్ దేహ వ్యవస్థ తిరస్కరించడాన్ని అవలీలగా నిరోధించగల డ్రగ్స్ ఇపుడు చాలా అందుబాటులో వున్నాయి కూడా-
గాఢాంధకారంలో కొట్టుమిట్టాడుతున్న వాడికి దూరంగా చిరుదీపం కనిపించినట్టు ఆశ రెపరెపలాడింది దీనదయాళ్ గుండెలో-
ప్రొఫెసర్ శాంతారాం రివాల్వింగ్ ఛెయిర్‌నుంచి లేచాడు-
వెళ్తూ- డాక్టర్ చెప్పిన చివరి మాటలు దీనదయాళ్‌లో పూర్తి ఆశను నింపాయి-
భగవంతుడు కరుణామయుడు- తప్పక వేణు బ్రతికే అవకాశం కలిగిస్తాడు-
'ఆక్సిడెంట్‌లో తల చితికిన వ్యక్తి అయినా ఫరవా లేదు- ప్రాణం పోకుండా వుండాలి. అదీ కండిషన్-'
తన కొడుకు ప్రాణంకోసం మరోచోట యాక్సిడెంట్ జరగాలా?
మరో తండ్రికి శోకం కలగాలా?
దీనదయాళ్ తల విదిలించాడు-
ఏమో అవన్నీ తనకు తెలీదు-
తన కొడుకు బ్రతకాలి-
జీవులు కర్మ సిద్ధాంతానికి బానిసలు-
తన కొడుకు బ్రతకాలని రాసివుంటే మరో ప్రాణికి ఉద్వాసన జరిగి తీరుతుంది-
తన ఆలోచనలో ఎక్కడో ఏదో అసహజత్వం- అన్యాయం తోచి ఒక్క క్షణం అతని మనసు కలతపడింది-
'సర్ అమ్మగారు...' అంటూ లోపలికొచ్చిన వార్డుబోయ్‌కి డాక్టర్ కనిపించలేదు-
కళ్లు మూసుకుని తపస్సు చేస్తున్నట్టున్న కోటీశ్వరుడిని ఒక్కక్షణం- అలాగే చూసి వెళ్లిపోయాడు వార్డ్ బోయ్.

★★★

'నా చిట్టి తల్లీ! ఒక్కసారి కళ్లు తెరిచి ఈ అమ్మని చూడమ్మా! ఇవాళ పండగ- నీ కిష్టమని బొబ్బట్లు చేసి తెచ్చాను.'
నిర్మల ఒళ్లంతా తడుముతూ పిలుస్తోందావిడ-
'శారదా ఏమిటీ పిచ్చి?'- శాంతారాం ఓదార్పుగా అన్నాడు.
'పిచ్చి కాదండీ- నిమ్మిని చూసి నా గుండె తరుక్కుపోతోంది. దాని మొహంలో కళ చెక్కుచెదరలేదండీ! అది మళ్లీ మామూలుగా మనుషుల్లో పడుతుందని చెప్పండి. మీరింత పెద్ద డాక్టరే- ఎంతమందికో ప్రాణం పోస్తున్నారే- నా చిట్టిని బాగుచేయలేరా? అది పిచ్చిలో వున్నా నా కిష్టమే- కాని దానిని కదిలించండి.
'శారదా? మన చేతిలో ఏముంది? నీ వేదాంతం అంతా ఏమయిపోయింది- రోజయు నాకు గీత విన్పించేదానివి. నువ్వే ఇలా మాట్లాడితే ఎలా? గుండె చిక్కబట్టుకోవాలి.'
'చదవడం వేరు అనుభవం వేరని నాకు తెలిసొచ్చింది. నేనీ శోకాన్ని తట్టుకోలేకపోతున్నాను- ఇది కళ్లు తెరిచి అలాగే చూస్తుంది తప్ప నన్ను 'అమ్మా' అని పిలవదు- ఉలకదు- పలకదు- మనమేం పాపం చేసామని దేవుడు మనకీ శిక్ష విధించాడండీ-'
నెల్లాళ్లుగా ఈ సంభాషణ రోజూ మామూలయిపోయింది- భార్య అలా ఏడవడం- తను ఓదార్చడం-
కానం బంగారపు బొమ్మలాంటి మెడిసిన్ చదివే తన కూతురు ఇలా జీవచ్ఛవంలా మారిపోతే తనకి మాత్రం శోకం లేదా?
ఒక్కగానొక్క కూతురిమీద ఎన్ని ఆశలు పెట్టుకున్నాడు తను- కాలేజీలో ఎవర్నో ప్రేమించి విఫలురాలై పిచ్చిదయిపోయింది- అన్నీ బూడిదలో పోసిన పన్నీరే- ఇపుడు కోమాలోకి జారిపోతోంది- తలలో గాయంవల్ల-
ఎంత దుఃఖం కలిగినా తను నిగ్రహించుకోక తప్పదు- లేకపోతే ఎన్ని ప్రాణాలు తన చేతిలో ఉన్నాయో- ఎందరు తల్లిదండ్రులు- అక్కచెల్లెళ్లు, అన్నదమ్ముల ఆశలు తన గుప్పిట్లో వున్నాయో-
ఒక్క సెకను పరాకుకి ఎంత మూల్యం చెల్లించాల్సి వుంటుంది-
అందుకే- ఆయన ఆగిపోయారు-
'డాక్టర్! నా భర్త...'
శారదాంబను పొదివి పట్టుకుని రూం బయటికి తెస్తున్న శాంతారాంగారి కాళ్లు పట్టుకుంది ఆ యువతి- నిద్రలేని కళ్లు-
ఆమె వేణుగోపాల్ భార్య- కోటీశ్వరుడి భార్యలా లేదు. పిచ్చిదానిలా తన సర్వస్వం కోల్పోయినట్టుంది-
'డాక్టర్‌గారూ డాడీని ఎప్పుడు ఇంటికి పంపిస్తారు- డాడీ అలా కళ్లు మూసుకుని ఇన్నాళ్లుండిపోతే నాకు ఏడుపొస్తోంది-'
ముద్దుల మూటకడుతున్న ఆ బాబు బుగ్గలపై కన్నీటి చారికలు-
ఆడిస్తూ పాడిస్తూ తన ముద్దుముచ్చట్లు తీర్చే తండ్రి మృత్యుముఖంలో వుంటే ఏ చిన్నారి గుండె అవిసిపోదు?
'ఎవరండీ వీళ్లు?'
తల్లీకొడుకులను చూసి శారదాంబగారు తన బాధ ఓ క్షణం మరిచింది-
భర్త నోటంట వేణుగోపాల్ గురించి వినేసరికి పెద్ద గీత ముందు చిన్న గీతలా అనిపించింది తన బాధ ఆవిడకి-
ఆ పిల్లని- పసివాడిని చూసి మనసు నీరయిపోయింది.
'బీ బ్రేవ్ మై ఛైల్డ్'
ప్రొఫెసర్ శాంతారాం బాబు భుజంతట్టి ఆ యువతితో అన్నారు-
'నీ భర్త తప్పక బ్రతుకుతాడమ్మా భయం లేదు.'
'డాక్టర్‌గారూ నా గుండె తీసి ఆయనకి పెట్టండి- తండ్రి లేకపోతే బాబు తట్టుకోలేడు- పసుపు కుంకుమలేని జీవితం నాకూ వద్దు. మా అత్తగారు దేవుడి గది వదిలి రావడం లేదు- పిచ్చిదానిలా అయిపోయిందావిడ. క్షమించండి- ఏం మాట్లాడుతున్నానో కూడా నాకు తెలియడం లేదు డాక్టర్-'
మతిలేనిదానిలా బాబు చెయ్యపట్టుకుని వాడిని గుండెలకు హత్తుకుందామె-
'డాక్టర్ చిన్నవాళ్ల గుండె పనికిరాదా?'
బాబు మాటలకి అంత పెద్ద డాక్టరూ చలించిపోయాడు. వాళ్లకి అంతులేని ఐశ్వర్యముంది-
బంధు జనాలున్నారు-
అండదండలున్నాయి- కానీ. అక్కరకు రావు ఇపుడు కావాల్సింది ఒక హృదయం. అందుకే ఇపుడు వాళ్లు అందరికంటే దీనస్థితిలో వున్నారు-
ఒక్కమనిషి చుట్టూ ఎంత ప్రపంచం అల్లుకుని వుంటుంది.
వేణుగోపాల్ ఒక భర్త-
ఒక తండ్రి-
ఒక కొడుకు-
ఒక అల్లుడు-
వేణుగోపాల్ కాదు- అతనిలాగే అందరు పేషంట్లూ- దురదృష్టవంతుడు- ఆయుష్షే లేదు-
సైన్సు ఎంతో అడ్వాన్సయింది. కాని కృత్రిమ గుండెలు వచ్చేంతవరకు ఎవరు మాత్రం ఏంచెయ్యగలరు-?
విధి చేతిలో కీలుబొమ్మలు-
డాక్టరయివుండీ తనేమిటిలా ఆలోచిస్తున్నాడు- తల విదిలించాడాయన.

★★★

డాక్టర్- మావాడికి పునర్జన్మనిచ్చారు- మీ రుణం ఎలా తీర్చుకోను- మీరే చెప్పండి-
'బాబూ- నిండు నూరేళ్లు వర్ధిల్లండి- నాకు పుత్రభిక్ష పెట్టారు-'
డాక్టర్... ఆ యువతి గొంతు పెగలలేదు- ఆ కళ్లలో కోటి దీపాల వెలుగులు-
''డాక్టర్‌గారూ డాడీ మళ్లీ నాతో టెన్నిస్ ఆడతారంటే ఎంత హాయిగా వుందో- ఇదిగో చాకెల్లట్-' చిట్టి చేతుల్లో చాక్లెట్- గొంతులో తేనె ఊరుతోంది-
బాబు కంఠంలో కృతజ్ఞతో- ఆనందమో తెలియదు.
దీనదయాళ్ కుటుంబం మొత్తం ప్రొఫెసర్ శాంతారాం కాళ్లమీద పడి మొక్కింది-
అన్నింటికీ చిరునవ్వు తప్ప మారు పలుకులేదు శాంతారాం నోట- అల్ల సంతోషం చూసి దీర్ఘవిశ్వాసం వెలువడింది.
దీనదయాళ్ పదిలక్షల విరాళం ఆ హాస్పిటల్ పేర రాసాడు వెళ్లిపోతూ-
దానికే ఆశ్చర్యం ప్రకటించలేదాయన-
కొన్నాళ్లు వేణుగోపాల్ డాక్టర్ల పర్యవేక్షణలో వుండాలన్న శాంతారాంగారి సూచన మేరకు డాక్టర్ నాగరాజు దీనదయాళ్ ఇంటికి అటెండవుతున్నాడు-
క్రమంగా వేణుగోపాల్ సాధారణ జీవితంలోకి వస్తున్నాడు-
'డాక్టర్ నాగరాజుగారూ! నాకు గుండెను దానం చేసిన దాతకు నేను జీవితాంతం కృతజ్ఞుడనై వుండాలి- వాళ్ల కుటుంబాన్ని వ్యక్తిగతంగా కలిసి కృతజ్ఞతలు చెప్పాలని వుంది' అన్నాడు వేణుగోపాల్ ఆయనతో.
'మీ కోరిక సగం తీరింది - సగం తీరదు'
'అదేం?'
'మీకు తన బిడ్డ గుండెను దానం చేసిన మహనీయుడు డాక్టర్ శాంతారాం! తన భార్యకు కూడా తెలియకుండా వైద్యపరంగా మెదడు మరణించిన తన కూతురి గుండె మీకు మార్చి తన గుండె రాయి చేసుకున్నారు- ఇంకా ఆర్నెల్లు కూతుర్ని జీవచ్ఛవంలాగైనా చూసుకుని తృప్తిపడచ్చు అనుకుంటే కూతురు అంత త్వరగా ఎందుకు చనిపోయిందో తెలియని కన్నతల్లి- ఆయన భార్య శారదాంబగారు దిగులుతో మంచం పట్టారు- కనుక మీరామెతో చెప్పడం బాగుండదు.
నాగరాజు మాటలకు వేణుగోపాల్‌తో బాటు మిగిలినవాళ్లు కూడా నిశ్చేష్టులయారు-

★★★

తన కూతురి ఫోటో ముందు ప్రొఫెసర్ శాంతారాం కూర్చున్నారు- ఫోటోలో ఆమె అందంగా నవ్వుతోంది.
'అమ్మా! నిర్మలా! నీ గుండె నతనికి మార్చినందుకు నీ డైరీ చదివాక కూడ నేను విచారించడం లేదు తల్లీ- మనసిచ్చిన నిన్ను నమ్మించి మోసం చేసాడనే బాధతో మతిచలించిన నువ్వు ఏడేళ్లు మెంటల్ ఆస్పత్రిలో జీవన్మరణ సమస్యలో కొట్టుమిట్టాడావు- కాని నీ గుండె వద్దని కాలదన్ని నిర్దాక్షిణ్యంగా వెళ్లిపోయిన అతనికి నీ హృదయం తప్ప దిక్కులేని స్థితి ఎలా వచ్చిందో నీకు తెలియదు- అపుడు వద్దనుకున్న నీ గుండెతోనే అతని జీవితం అహర్నిశలూ ముడిపడి వుంది. నీకు ద్రోహం చేసింది ఆతనుగాని, అతని భార్యాబిడ్డలుకాదు- కేవలం వాళ్ల కోసమే నేనీ పని చేసాను- తప్పా?
'తప్పు లేదు నాన్నా' అంటున్నట్టు నవ్వుతోంది నిర్మల-

★★★